క్లుప్తంగా

ఆలయానికి కుర్చీల బహూకరణ



ఆలయ కమిటీ ప్రతినిధులకు కుర్చీలను అందజేస్తున్న దాతలు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు పరిధి బాలచెరువులోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయానికి గంగవరం పోర్టు ఉద్యోగులు ప్రభాకర్, పిలకా సూర్యనారాయణ కుర్చీలను బహూకరించారు. గంగవరం పోర్టు ఎంప్లాయీస్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు పిలకా అప్పారావురెడ్డి, అధ్యక్షుడు కేవీఎస్ఎన్ రాజు, అడ్వకేట్ నానాజీ చేతుల మీదుగా ఆలయ కమిటీ ప్రతినిధులకు వీటిని అందజేశారు.

హౌస్ కమిటీ బాధితులందరికీ న్యాయం చేయాలి



తుంపాల శ్రీరామ్మూర్తి

గాజువాక : గాజువాక హౌస్ కమిటీ భూముల క్రమబద్ధీకరణ ద్వారా బాధితులందరికీ న్యాయం చేయాలని జిల్లా పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు తుంపాల శ్రీరామ్మూర్తి కోరారు. గాజువాకలోని 65, 66, 67, 70 వార్డుల పరిధిలో జీవో నంబర్ 301 ద్వారా పట్టాలు పొందిన హౌస్ కమిటీ బాధితులకు జీవో నంబర్ 71 ద్వారా హక్కుల పత్రం, ఆస్తి బదిలీకి అనుమతి పత్రం అందజేసేందుకు కలెక్టర్ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అందరికీ జీవో నంబర్ 301లో సూచించిన ధరలకే క్రమబద్ధీకరణ చేసి ఇవ్వాలని కోరారు.

బీజేపీ నాయకుల బైక్ ర్యాలీ

గాజువాక : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి పీవీఎన్ మాధవ్ నామినేషన్‌లో పాల్గొనేందుకు ఆ పార్టీ గాజువాక నాయకులు బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఆ పార్టీ గాజువాక కో–ఆర్డినేటర్ కరణంరెడ్డి నర్సింగరావు శ్రామిక నగర్‌లో ప్రారంభించారు. అక్కడి నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు బైక్‌లపై తరలి వెళ్లారు. నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

పెదగంట్యాడ: జీవీఎంసీ 74వ వార్డు పరిధి దల్లివానిపాలెం, సిద్ధేశ్వరం ప్రాంతాల్లో రూ.40లక్షలతో నిర్మించనున్న రోడ్లు, కాలువల పనులు ప్రారంభమయ్యాయి. కార్పొరేటర్ వంశీరెడ్డి మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి శంకుస్థాపన చేసిన పనులను బుధవారం ప్రారంభించినట్లు చెప్పారు. నాణ్యతతో పనులు చేపట్టాలని సూచించామన్నారు. కార్యక్రమంలో గొందేశి సత్యారావు, దల్లి పైడికొండ, గొందేశి సత్తిరెడ్డి, అప్పారావు, గొరుసు రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



చీరలను పంపిణీ చేస్తున్న నాయకులు

గాజువాక: స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు బచ్చల త్రిమూర్తులు ఆధ్వర్యంలో మహిళలకు బుధవారం చీరలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు జన్మదినం సందర్భంగా ఈ సేవా కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు విశ్వనాథపల్లి నాగ సుందరం, కిరణ్, శరగడం త్రిమూర్తులు, కె.కోటేశ్వరరావు, శ్రీనివాస్, వెంకట్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా సిటూ ప్రచారం

అక్కిరెడ్డిపాలెం: త్రిఫ్ట్ సొసైటీ ఎన్నికల్లో సీఐటీయూ ప్యానల్‌ను గెలిపిస్తే భెల్ ఉద్యోగులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తామని సిటూ ప్రధాన కార్యదర్శి జి.టి.పి.ప్రకాష్ అన్నారు. సంస్థలో బుధవారం అభ్యర్థులతో కలిసి ప్రచారం చేశారు. కార్యక్రమంలో సిటూ ప్యానల్ అభ్యర్థులు కె.విజయ్ కుమార్, ఎస్.అప్పారావు, కె.నారపురెడ్డి, జి.రాంబాబు, పి.కనకారావు, పి.శివరాం, బి.కృష్ణమూర్తి నాయకుడు ఎస్.జగన్నాధరావు పాల్గొన్నారు.

విద్యార్థుల భద్రతకు భరోసా

ఒక ప్రమాదం రహదారిపై విద్యార్థుల భద్రతను ప్రశ్నార్థకంగా మార్చింది. పాఠశాల యాజమాన్యాల బాధ్యతను ప్రశ్నించింది. తమ కళ్ల ముందే విగతజీవిగా నిలిచిన బాలుడిని చూసి చలించని హృదయం లేదు. అటువంటి ఘటనలు పునరావృతం కాకూడదన్న సంకల్పంతో పోలీసు అధికారులు చేపట్టిన చర్యలు ఉక్కు నగరాన్ని మోడల్ స్కూల్ జోన్ దిశగా మార్చేందుకు అడుగులు వేయించాయి. పాఠశాల యాజమాన్యాలు అందించిన సహకారంతో చేపట్టిన చర్యలు పిల్లల భద్రతకు భరోసా కల్పించాయి.



డీపాల్ పాఠశాల కూడలి వద్ద స్టాపర్ల ఏర్పాటు, పెయింటింగ్ వేసిన స్పీడ్ బ్రేకర్లు

- పాఠశాలల పరిసరాల్లో పటిష్ట చర్యలు
- మోడల్ స్కూల్ జోన్ దిశగా అడుగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ మోడల్ స్కూల్ జోన్ దిశగా అడుగులు వేస్తోంది. ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు చేపడుతోంది. ఆ దిశగా స్టీల్‌ప్లాంట్ పోలీసుల చొరవతో పాటు టౌన్‌షిప్ పాఠశాలల యాజమాన్యాల సహకారం ప్రశంసనీయం.

ఏం జరిగిందంటే..

గతేడాది డిసెంబర్ 22న టౌన్‌షిప్ సెక్టార్–9లోని డీపాల్ పాఠశాల విద్యార్థి తన తల్లితో పాఠశాలకు వెళ్తుండగా, పాఠశాల కూడలి వద్ద వెనుక నుంచి ఫార్మాసిటీ బస్సు ఢీకొంది. ఈ సంఘటనలో ఆ బాలుడు దుర్మరణం చెందాడు. దీంతో ఉక్కునగరంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆ రోజు సాయంత్రం వరకు ఆ బాలుని మృతదేహం నడిరోడ్డుపైనే ఉందంటే తీవ్రత అర్థం చేసుకోవచ్చు. అదే రోజు పోలీసు ఉన్నతాధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించి భవిష్యత్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు.



వీవీవీ పాఠశాల కూడలి వద్ద స్కూల్ జోన్ బోర్డుల ఏర్పాటు

సీఐ శ్రీనివాసరావు చొరవతో..

ఈ నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ సీఐ వి.శ్రీనివాసరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పాఠశాలల యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేశారు. పాఠశాలల పరిసరాల్లో స్కూల్ జోన్ బోర్డులు ఏర్పాటు చేయాలని, కూడళ్ల వద్ద స్టాపర్లు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ నియంత్రించేందుకు సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేయాలని, స్పీడు బ్రేకర్లకు పెయింటింగ్ చేయాలని, పాఠశాలల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై డీపాల్ పాఠశాల యాజమాన్యం సానుకూలంగా స్పందించింది. సీసీ కెమెరా తప్ప మిగతావన్నీ ఏర్పాటు చేశారు. అదే విధంగా శృష్టి వరల్డ్ పాఠశాల, విశాఖ విమల విద్యాలయం, డీపీఎస్ పాఠశాలలు స్టాపర్ల ఏర్పాటుతో పాటు సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేశాయి. ఈ అంశంపై సీఐ శ్రీనివాసరావు రెండు సార్లు పాఠశాలల యాజమాన్యాలతో సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేసి, పనులు వేగవంతం చేయాలని నిర్దేశించారు. అదే విధంగా ఆ రహదారిలో పాఠశాలల వేళల్లో ప్రైవేటు వాహనాల నియంత్రణకు చర్యలు చేపట్టారు. విద్యార్థుల భద్రతకు స్టీల్‌ప్లాంట్ పోలీసులు తీసుకుంటున్న చర్యలపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శాశ్వత ప్రాతిపదికన చర్యలు



విద్యార్థుల భద్రతకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అన్ని పాఠశాలలు జాగ్రత్తలు చేపట్టేలా నిర్దేశించాం. కేవలం తాత్కాలిక పద్ధతిన కాకుండా, శాశ్వత చర్యల కోసం ఆయా పాఠశాలల యాజమాన్యాలతో చర్చిస్తున్నాం. ఈ విషయంలో అని పాఠశాలలు స్పందించాల్సిందే. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటాం.

– వి. శ్రీనివాసరావు, స్టీల్‌ప్లాంట్ స్టేషన్ సీఐ

కార్మికుల భవిష్యత్తు అంధకారం



దీక్షలో పాల్గొన్న బ్లాస్ట్‌ఫర్నేస్ కార్మికులు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేట్‌పరం చేస్తూ, కార్మికుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలో 741వ రోజు, బుధవారం సంస్థకు చెందిన బ్లాస్ట్‌ఫర్నేస్ విభాగాల కార్మికులు పాల్గొని, సంఘీభావం తెలిపారు. కార్మికులకు అన్యాయం చేస్తూ ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తుల చేతికి ఇస్తే కార్మికుల భవిష్యత్తు ఏంటని ప్రశ్నించారు. కార్మిక చట్టాలను తుంగలోకి తొక్కుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రజలు ఆగ్రహంగా ఉన్నారని, రానున్న ఎన్నికల్లో కేంద్రంలోని బీజేపీకి తగిన గుణపాఠం నేర్పుతారని అన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

- స్టేట్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ ఆఫీసర్ డాక్టర్ శాంతి
- వడ్లపూడి, దేవాడ పీహెచ్‌సీల సందర్శన
- రికార్డుల తనిఖీ



గర్భిణులకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ శాంతి



దేవాడ పీహెచ్‌సీలో ఓపీని పరిశీలిస్తున్న డాక్టర్ శాంతి

కూర్మన్నపాలెం: గర్భిణుల ఆరోగ్యంపై సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని స్టేట్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ ఆఫీసర్ డాక్టర్ శాంతి సూచించారు. వడ్లపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు నిర్వహించే రక్తపరీక్షల రికార్డులను డీఐవో జీవన్ రాణితో కలిసి బుధవారం ఆమె పరిశీలించారు. గర్భిణుల ఆరోగ్య స్థితిగతులను ఆశ కార్యకర్తలు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణులకు నిర్వహిస్తున్న రక్త పరీక్షల్లో హిమోగ్లోబిన్ స్థాయిని తెలుసుకుని, వాటికనుగుణంగా మందులు తీసుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వారి హెచ్‌బీ స్థాయిని తెలిపే టెస్ట్ రిపోర్టులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రసవ సమయంలో దగ్గరుండి వారికి ధైర్యం చెప్పాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుధాకర్, ఎంపీహెచ్‌ఈవో బాబీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

దేవాడ పీహెచ్‌సీ పరిశీలన

పెదగంట్యాడ: వైద్య సేవల కోసం పీహెచ్‌సీలకు వచ్చే రోగులకు సత్వర సేవలందించాలని హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ స్టేట్ కన్సల్టెంట్ హెడ్ డాక్టర్ శాంతి, జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ జీవనరాణి సూచించారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని దేవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వైద్యుల బృందం బుధవారం సందర్శించింది. ఆస్పత్రి ఓపీని పరిశీలించిన అనంతరం రోగులకు అందుతున్న సేవలపై వైద్యులు ఆరా తీశారు. సమయ పాలన పాటించాలని ఆదేశించారు. గర్భిణులకు హెచ్‌బీ పరీక్షలు నిర్వహించడంతో పాటు వాటిని సక్రమంగా పరిశీలించి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ ప్రసాద్ రాజాకు సూచించారు.

స్కౌట్స్, ఎన్‌సీసీల్లో భాగస్వాములు కావాలి

- న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ మన్మథరావు
- నడుపూరు జెడ్పీ హైస్కూల్లో స్కౌట్స్ దినోత్సవం
- అలరించిన విద్యార్థుల విన్యాసాలు



విన్యాసాలు చేస్తున్న జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు



కణితి హైస్కూల్‌లో ప్రసంగిస్తున్న హెచ్‌ఎం సూర్యప్రకాశరావు

పెదగంట్యాడ: విద్యార్థి దశ నుంచే దేశ రక్షణ రంగంపై అవగాహన పెంచుకోవాలని న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ మన్మథరావు అన్నారు. నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ స్కౌట్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి స్కౌట్స్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వంటి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలన్నారు. విద్యార్థులు స్కౌట్స్‌లో నైపుణ్యం సాధిస్తే భవిష్యత్తు బంగారుమయం అవుతుందని చెప్పారు. ఇదే స్ఫూర్తితో చదువులోనూ రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సమాజంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలలో హిందూస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు పలు విన్యాసాలు ప్రదర్శించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్, స్కౌట్ మాస్టర్ ఎస్.ప్రశాంత్, పీడీ సత్యవతి, గాజువాక హైస్కూల్ గైడ్ కెప్టెన్ వనజ, మల్కాపురం జీవీఎంసీ హైస్కూల్ గైడ్ కెప్టెన్ గీత, స్కూల్ పీటీ దేముడు తదితరులు పాల్గొన్నారు.

కణితి జెడ్పీ హైస్కూల్లో ..

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు బి.సూర్యప్రకాశరావు ఆధ్యక్షతన స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. స్కౌట్స్ విద్యార్థులు చేసిన పిరమిడ్స్, కర్రసాము ప్రదర్శన, మార్చ్‌పాస్ట్ ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ వల్ల విద్యార్థుల్లో సేవాగుణం, ఆరోగ్యం, హస్తకళలు అనేవి వృద్ధి చెందుతాయన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ కెప్టెన్ ఎలజాక్షి మాట్లాడుతూ రాబర్ట్ బేడన్ పావెల్ జయంతిని పురస్కరించుకుని ఏటా ఫిబ్రవరి 22న స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉత్సవాలు జరుపుతున్నామన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీడీ మన్నాజీ, ఎ.శ్రీనివాస్, బి.అప్పారావు, పి.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్‌కు తరలిన నాయకులు



ర్యాలీగా వెళ్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి, దేవన్‌రెడ్డి తదితరులు

పెదగంట్యాడ: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్ నామినేషన్ సందర్భంగా గాజువాక నుంచి పెద్ద సంఖ్యలో కార్పొరేటర్లు, నాయకులు బుధవారం తరలివెళ్లారు. బీసీ రోడ్డులోని టీఎస్ఆర్ ఫంక్షన్ హాల్ వద్ద బైక్ ర్యాలీని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి, 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు భూపతిరాజు సుజాత, గుడివాడ అనూష, బొడ్డు నర్సింహపాత్రుడు, నాయకులు ధర్మాల శ్రీను, బోగాది సన్నీ, రాజాన వెంకటరావు, గొందేశి వెంకటరమణారెడ్డి, వై.మస్తానప్ప, గౌస్, ఎన్నేటి రమణ, నాగిశెట్టి శ్రీను, అండిబోయిన అప్పారావు, వెంపాడ అప్పారావు, జుత్తు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీహెచ్‌ఈఎల్ కో–ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు నేడు



సొసైటీ కార్యాలయంలో ఎన్నికల కోసం చేస్తున్న ఏర్పాట్లు

అక్కిరెడ్డిపాలెం: భెల్ ఎంప్లాయీస్ కో ఆపరేటివ్ త్రిఫ్ట్ అండ్ క్రెడిట్ సొసైటీ ఎన్నికలను గురువారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సీహెచ్.ఎస్.త్రినాధరావు తెలిపారు. సొసైటీ కార్యాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. అదే రోజు సాయంత్రం ఫలితాలను వెల్లడించనున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో 472మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకుని, 8మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారు. పోటీలో ప్రొగ్రెసివ్ ఫ్రంట్, పరిరక్షణ ఫ్రంట్, యునైటెడ్ ఫ్రంట్‌ల నుంచి 24మంది అభ్యర్థులు నిలిచినట్లు తెలిపారు. కట్టుదిట్టమైన భద్రత నడుమ ఎన్నికలు సజావుగా సాగేలా ఏర్పాట్లు చేసినట్లు సొసైటీ మేనేజర్ గవర వెంకటరమణారావు తెలిపారు.

జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌లో సత్తా



పతకం, ప్రశంసాపత్రం అందుకుంటున్న నరసింగరావు

అగనంపూడి: జాతీయ స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్‌లో అగనంపూడి నిర్వాసిత కాలనీ దిబ్బపాలేనికి చెందిన ఉక్కు ఒప్పంద కార్మికుడు చట్టి నరసింగరావు సత్తా చాటారు. హర్యానాలో ఈ నెల 16 నుంచి నాలుగు రోజుల పాటు హర్యానా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సారథ్యంలో నిర్వహించిన పోటీల్లో నరసింగరావు పాల్గొని రజత పతకం దక్కించుకున్నారు. ఈ పోటీల్లో 28 రాష్ట్రాల నుంచి క్రీడాకారులు పాల్గొనగా, నాలుగు వందల మీటర్ల రిలే పరుగు పందెంలో నరసింగరావు ద్వితీయ స్థానంలో నిలిచి పతకం గెలుచుకున్నారు.

జాతీయ యువజనోత్సవాల్లో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో రెక్టార్ మధుసూదనరావు, ప్రిన్సిపాల్ అరుంధతి

అగనంపూడి: జాతీయ స్థాయి యువజనోత్సవాల్లో దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభాపాటవాలు ప్రదర్శించారు. గుంటూరు జిల్లాలోని విజ్ఞాన్ డీమ్డ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు పలు పోటీలు నిర్వహించారు. విజ్ఞాన్ కాంచన బృందం వాలీబాల్ పోటీలు, అథ్లెటిక్స్ వంద మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకాలు సాధించారు. లాంగ్ జంప్‌లో (బాలుర) విభాగంలో రజత పతకం, నాలుగు వందల మీటర్ల రిలే పరుగు పందెంలో బాలురు, బాలికల విభాగాల్లో పసిడి పతకాలు దక్కించుకున్నారు. 16వందల మీటర్ల పందెంలో బాలికల విభాగంలో కాంస్య పతకం దక్కించుకున్నట్టు కళాశాల రెక్టార్ వి.మధుసూదనరావు తెలిపారు. ఈ సందర్భంగా దువ్వాడ క్యాంపస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలను రెక్టార్‌తో పాటు ప్రిన్సిపాల్ బి.అరుంధతి, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు, డీన్ సతీష్ తదితరులు అభినందించారు.

అలరించిన స్వరార్చన



పాటలు ఆలపిస్తున్న గాయకులు

సీతంపేట: స్వరార్చన, యునైటెడ్ సింగర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పౌరగ్రంథాలయంలో ఇటీవల పరమపదించిన సినీ దిగ్గజాలు కృష్ణ, కృష్ణంరాజు, జమున, కె.విశ్వనాథ్, వాణీ జయరామ్‌లకు స్వరార్చనతో నివాళులు అర్పించారు. గాయనీ గాయకులు భూపతిరావు, ఎస్.రాజేశ్వరి, బాబ్జి, భాగ్యలక్ష్మి, కృషరాజు, కల్యాణి, వెంకట్, సాత్విక సినీ దిగ్గజాల హిట్ సాంగ్స్ పాడి అలరించారు. వీరికి కీ బోర్డుపై సోమేష్, తబలాపై చలం, ఫాడ్స్‌పై బాబ్జి చక్కని సంగీతం అందజేశారు. ముందుగా సంఘం గౌరవాధ్యక్షులు కొణతాల రాజు, ఘంటశాల క్రీడా సాంస్కృతిక సంఘం వ్యవస్థాపకులు చెన్నా తిరుమలరావు, స్వర మాధుర్యం అధ్యక్షులు ఎం.వి.ఆర్.నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కళా సంస్థల ప్రతినిధులు పుండరీ కుమార్, మెలోడి సత్యనారాయణ, ఫణి భూషణ్ పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



ఆశిష్ మృతదేహం

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని కాకతీయ పబ్లిక్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. న్యూపోర్టు ఎస్‌ఐ మన్మథరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రం, కోరాపుట్, పాట్టంగి, గంగరాజ్‌పూర్‌కు చెందిన ఆశిష్ జయపురియా (18) కాకతీయ పబ్లిక్ స్కూల్‌లో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఆ పాఠశాలకు చెందిన ఐటీఐ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ నెల 21న రాత్రి 8 గంటల సమయంలో హాస్టల్‌లో ఫ్యాన్‌కు ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన పాఠశాల యాజమాన్య ప్రతినిధులు వెంటనే ఆ విద్యార్థిని గాజువాకలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. అయితే ఆ విద్యార్థి అప్పటికే మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. అనంతరం విద్యార్థి తండ్రి పూర్ణ జయపురియాకు సమాచారం అందజేశారు. హుటాహుటిన ఇక్కడకు వచ్చిన పూర్ణ న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ మన్మథరావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. విద్యార్థి ఆత్మహత్యకు గల కారణాలపై ఆరా తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నగర సుందరీకరణ పనుల పరిశీలన

గోపాలపట్నం : వచ్చే నెలలో జీ–20 సదస్సు జరగనున్న నేపథ్యంలో జాతీయ రహదారిలో జరుగుతున్న సుందరీకరణ పనులను జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు బుధవారం పరిశీలించారు. ఎయిర్‌పోర్టు జంక్షన్ నుంచి గ్రీన్ బెల్ట్ వరకు పరిస్థితి ఇంకా మెరుగుపడాలని, పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఫుట్‌పాత్‌లకు రంగులు వేసే పనులు త్వరితగతిన చేయాలని ఆదేశించారు. గ్రీన్ బెల్టు ఫెన్సింగ్ బాగు చేయాలని, వృథాగా ఉన్న కేబుల్ తీగలు తొలగించాలన్నారు. చాలా చోట్ల నిరుపయోగంగా ఉన్న సైన్ బోర్డులు తొలగించాలని సూచించారు. గ్రీన్ బెల్టులో వ్యర్థాలు ఉండడాన్ని గమనించి వాటిని తొలగించాలని సూచించారు. విమాననగర్ జంక్షన్ వద్ద నిరుపయోగంగా ఉన్న బస్ స్టాపులను ఆధునికీకరించాలని ఆదేశించారు. అలాగే వంటిల్లు సమీపంలో ఉన్న పాత బస్‌స్టాపులను పూర్తిగా తొలగించి ఆ స్థానంలో టాయ్‌లెట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ పనులు సత్వరం పూర్తి చేయాలని సూచించారు.

అధ్వానంగా డ్రైనేజీ



కృష్ణానగర్‌లో మురుగుతో నిండిపోయిన డ్రైనేజీ

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీల పరిస్థితి అధ్వానంగా మారింది. ప్రధాన రహదారితో పాటు వీధుల్లోనూ డ్రైనేజీలు ఆక్రమణకు గురి కావడంతో, కాల్వలు కుదించుకుపోయి మురుగు రోడ్డెక్కుతోంది. పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు చెత్తను తొలగించకపోవడంతో షిల్ట్ పేరుకుపోతోంది. అధికారులు స్పందించి, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

రాజగోపాలరావు సేవలు చిరస్మరణీయం



రాజగోపాలరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కూర్మన్నపాలెం: మాజీ పార్లమెంట్ సభ్యుడు బొడ్డేపల్లి రాజగోపాలరావు సేవలు చిరస్మరణీయమని 87వ వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు అన్నారు. దివంగత రాజగోపాలరావు 31వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి వైఎస్సార్‌సీపీ నాయకురాలు పేడాడ రమణికుమారి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పి. శ్రీనివాసరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, దుగ్గపు దానప్పలు, మార్పు శేషు, గోనపు సన్యాసిరావు, పూడి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

గాంధేయ విలువలతో సుస్థిర ఆర్థికాభివృద్ధి

ఏయూ క్యాంపస్: సుస్థిర ఆర్థిక, పారిశ్రామికాభివృద్ధి సాధనకు గాంధేయ విలువలు, విధానాలు అవసరమని విశాఖపట్నం స్పెషల్ ఎకనామిక్ జోన్ డెవలప్‌మెంట్ కమిషనర్ రోషిణి అపరంజి కొరటి అన్నారు. బుధవారం ఆంధ్రా యూనివర్సిటీ గాంధీయన్ స్టడీస్ సెంటర్‌ను ఆమె సందర్శించారు. సాంఘిక సంక్షేమంపై గాంధేయ ఆలోచనలు ఆమోదించిన స్వదేశీ మార్కెట్‌లు సమగ్ర అభివృద్ధికి దోహదపడతాయని రోషిణి చెప్పారు. సెంటర్ డైరెక్టర్ డాక్టర్ చల్లా రామకృష్ణ గాంధీజీ పుస్తకాలను ఆమెకు బహూకరించారు. కేంద్రం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిషోర్ కుమార్, డాక్టర్ కృష్ణవీర్ అభిషేక్, తదితరులు పాల్గొన్నారు.